నేడు వేమన ఆంధ్ర భాషానిలయం దశాబ్ది ఉత్సవాలు

కవాడిగూడ: ఏవీ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఏవీ కళాశాల పీజీ సెంటర్ సంచాలకులు డాక్టర్ ఎం.భగవంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రాజలింగం తెలిపారు. వేమన ఆంధ్రభాషా నిలయం దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా ఉస్మానియా యూనివర్శిటీ గ్రంథాలయాల శాఖ విశ్రాంత ఆచార్య ఎస్.లక్ష్మణ్‌రావు, ప్రత్యేక అతిథులుగా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, డాక్టర్ ఎం. రాంచందర్, డాక్టర్ చెగోని రవికుమార్, ఏవీ కళాశాల కరస్పాండెంట్ ఎ.గౌతమి, ఏవీ కళాశాల గ్రంథ పాలకులు ఎం.రవీందర్, పి.ప్రతిభ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



చెంచుబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్...

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్ చెంచు బస్తీలో కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి బుధవారం పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిమెంట్ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... బస్తీలో ఎలాంటి సమ్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫీవర్’ భవనాలను సత్వరమే పూర్తిచేయండి

- భవన నిర్మాణ పనులను పరిశీలించిన అంబర్‌పేట ఎమ్మెల్యే
- నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించిన కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా చేపట్టిన ఓపీ బ్లాక్, ఇతర భవన నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. దశాబ్దాలపాటు మన్నికగా ఉండాల్సిన భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి ఆవరణలో కొనసాగుతున్న నూతన భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్‌తో ఆయన చాంబర్‌లో సమావేశమైన ఎమ్మెల్యే భవన నిర్మాణ పురోగతిపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పేద రోగులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు పూనుకున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే అన్ని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చడంతో పాటు, అవసరం మేరకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలాగే అన్ని డివిజన్‌ల పరిధిలోనూ బస్తీ దవాఖానల ఏర్పాటుతో పేద ప్రజలకు వైద్యసేవలను చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఫీవర్‌లో నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లంకబస్తీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లంక బస్తీలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా శాస్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం లంక బస్తీలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్‌లు వేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి విజ్ఞాపరి సెక్షన్ మేనేజర్ షాఖీర్, బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరించండి...

కాచిగూడ: సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. బుధవారం కాచిగూడ, నింబోలిఅడ్డాలో అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నేతలతో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నింబోలిఅడ్డాలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అవసరమైన చోట కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు వేయాలని, మిగతా చోట్ల తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, కన్నయ్య సింగ్, రూపాబాయ్, సోయంబర్ సింగ్, బలరాం సింగ్, చందర్ బాన్‌సింగ్ పాల్గొన్నారు.



నింబోలిఅడ్డాలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే...

పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తాం: ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ బాప్టిస్ట్ చర్చ్ లైన్‌లో నూతన వాటర్ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన కారణంగా కొన్ని అభివృద్ధి పనులు నిలిచిపోయాయని... ఆ ప్రక్రియ మొత్త పూర్తయినందున వివిధ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గంలో మంచినీటి కొరత లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతానని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాగులు యాదవ్, భిక్షపతియాదవ్, లక్ష్మణ్‌గౌడ్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, నేతలు భాస్కర్, బలవంత్‌రాజ్, ఆకారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్-11 కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. సుందర్ నగర్ ఫీడర్ పరిధిలో సుందర్‌నగర్, కృష్ణానగర్, నెహ్రూనగర్, బోన్ ఫ్యాక్టరీ, కాచిగూడ కమేలా తదితర ప్రాంతాలలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో అంబర్‌పేట్, దుర్గానగర్ కమాన్, ఆజాద్‌నగర్, ఆలీకేఫ్ చౌరస్తా తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వివరించారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు



నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సంఘం(టీబీఎస్) ప్రతినిధి బృందం రాష్ట్ర ఐటీ, శాసన సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపింది. టీబీఎస్ నాయకులు పోచంపల్లి రమణారావు, దేవులపల్లి రంగారావు, దుర్గా ప్రసాద్, అక్కిరాజు గిరి, అవ్వ లక్ష్మీ నరసింహారావు, విజయలక్ష్మి, ఎ.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసిఆర్‌కు ఎంఎన్ పరామర్శ

ముషీరాబాద్: యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు బుధవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రజా సమస్యలపై గళమెత్తాలని శ్రీనివాస్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు.



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రావు

క్షీరలింగేశ్వరస్వామికి ఘనంగా అన్నపూజ

చిక్కడపల్లి: గాంధీనగర్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలోని క్షీరలింగేశ్వర స్వామి వారికి బుధవారం అన్నపూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అన్నపూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆంజనేయ స్వామి ఆలయ ఈవో దేవనాథం, లక్ష్మీగణపతి ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి, పూజారి రామాచారి తదితరులు పాల్గొన్నారు.



అన్నపూజలో కార్పొరేటర్ పావని

నృత్య పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: ప్రజాపతి పేరిట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ వరసిద్ధి వినాయక (కాణిపాకం), 25వ తేదీ శ్రీకాళహస్తి ఆలయాల్లో కల్చరల్ ఈవెంట్లను నిర్వహించనున్నట్లు అధినేత నూలు ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వర్ధమాన కళాకారుల కోసం వివిధ రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలలో ఈ నెల 24, 24వ తేదీలలో నిర్వహించనున్న కల్చరల్ ఈవెంట్ కు ఆసక్తి గలవారు తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కూచిపూడి, భరతనాట్యం కథక్, ఒడిసి, పేరిణి తదితర అంశాలను ప్రదర్శించవచ్చునన్నారు. నృత్య ప్రదర్శన పోటీల్లో పాల్గొనే కళాకారులకు సర్టిఫికెట్, పతకంతో సత్కరించనున్నట్లు వివరించారు. డ్యాన్స్ అకాడమీకి గురువులకు మెమెంటోతో పాటు రూ. 1116లతో సత్కరిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్: 98667 16555లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంను పటిష్టంగా అమలు

కాచిగూడ: ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళిక చట్టంను పార్లమెంట్ పరిధిలోకి తీసుకురావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంను దేశ వ్యాప్తంగా పటిష్టంగా అమలు పరచాలని.. ఈ చట్టం క్రింద నమోదు అయిన కేసుల్లో నిందితులకు 41సిఆర్‌పీసీ కింద పోలీస్ స్టేషన్‌లో బెయిల్ ఇచ్చే విధానంను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణగూడ లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ శాతాన్ని 15 నుండి 25 శాతానికి పెంచుతూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని ప్రధానికి బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ చిత్రపటంను ఇండియా కరెన్సీ నోట్లపై ముద్రించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలనే కేంద్ర కేబినెట్ ఆలోచనలను మానుకోవాలని డిమాండ్ చేశారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

లిబర్టీ: మహనీయులు, త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పుల్లూరు వెంకటరాజేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ న్యాయవాది పి.వి.నారాయణరావు వర్ధంతి సభ పార్టీ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర సమరంలో నారాయణరావు చూరుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే సాగిన ఉద్యమంలో పాల్గొని ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. న్యాయవాదిగా పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించారని అన్నారు. నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి రాజేశ్వరరావు అంజలి ఘటించారు. కార్యక్రమంలో పి.వి.శ్రీనివాసరావు, సంకర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ సామాజిక సేవ దృక్పథం అలవర్చుకోవాలని సోషల్ వర్కర్ పూజల శ్రీనివాస్ అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఫుట్‌పాత్‌పై ఉంటున్న వారికి, జీహెచ్ఎంసీ వర్కర్లకు మంగళవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో ఫుట్‌పాత్‌లపై నివాసిస్తున్న వారికి, నిరాశ్రయులకు చేయూత అందించేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన కోరారు. ఆనంద్‌నగర్, పల్టాన్, దయానంద్‌నగర్, మలక్‌పేట ప్రధాన రహదారులలో దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో బీజేపీ ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

చిక్కడపల్లి: కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో దొరికిన నల్లధనంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ధర్నా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని క్రాస్‌రోడ్డులో నినాదాలు చేస్తూ బీజేపీ నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రామ్ మాట్లాడుతూ... రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడు, భారత్ జోడో యాత్ర ఇన్‌చార్జ్ ధీరజ్‌సాహు ఇంట్లో దొరికిన రూ. 450 కోట్ల నల్లధనం ఎంపీ ధీరజ్ సాహుదా లేక రాహుల్‌గాంధీదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పదే పదే సీబీఐని, ఈడీని తక్కువ చేసి మాట్లాడిన రాహుల్‌గాంధీ వారి పార్టీ రాజ్యసభ సభ్యుడి విషయంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారో దేశ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు జి.వెంకటేష్, జైపాల్‌రెడ్డి, బద్రీనారాయణ, నవీన్‌గౌడ్, బొల్లంపల్లి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీలపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు’



అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేత శంబుల శ్రీకాంత్ గౌడ్

అంబర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఆరు సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని టీపీసీసీ కార్యదర్శి శంబుల శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఫేక్ ఐడీ కార్డు పేరిట ప్రజలను మోసం చేస్తూ ఒక్క కార్డుకి రూ. 100 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫేక్ ఐడీ కార్డులు తీసుకోమని మీ వద్దకు ఎవరైనా వచ్చినా, వారిని వదలకుండా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు జాంగీర్, అఫ్జల్ ఖాన్, మణికాంత్ గౌడ్, శంభుల ఉషశ్రీ, వీరన్న నాయక్, మహ్మద్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వేమరాజు సాహితీ సేవలు చిరస్మరణీయం: జస్టిస్ రామలింగేశ్వరావు



నరసింహారావు జయంతిలో పాల్గొన్న జస్టిస్ రామలింగేశ్వరావు తదితరులు

చిక్కడపల్లి: నవ్యసాహిత్యసమితి, నవ్యనాటక సమితి సంస్థలను స్థాపించి 60 ఏండ్ల క్రితమే సాహితీ సాంస్కృతిక రంగాలలో విశేష కృషి చేసిన వేమరాజు నరసింహారావు చిరస్మరణీయుడు అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరావు ప్రశంసించారు. ఆయన కృషిని వారి కుమారుడు విజయకుమార్ కొనసాగిస్తున్నారని అభినందించారు. బుధవారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలోని ప్రధాన వేదికలో రాత్రి నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవం వేమరాజు నరసింహారావు 94వ జయంతి సభ జరిగింది. నృత్యప్రభ పేరిట ప్రముఖ నాట్య గురువులు రేణుక ప్రభాకర్, మృణాళిని, శ్రీలత, వాణీ రమణ, భరణి, మధుమతి, స్నేహ, చంద్రశేఖర్ శిష్య బృందం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ రామ లింగేశ్వర్‌రావు బ్రిటన్‌లో స్థిర పడిన సాంస్కృతిక రంగ ప్రచారకులు రామా వి.శాంతారామ్‌ను సత్కరించి మాట్లాడారు. మంచి హృదయంతో నడిపే నడిపే సంస్థలు నిరాటంకంగా నడుస్తాయి అనటానికి నవ్యనాటక సమితి ఉదాహరణ అన్నారు. తెలుగు వారికి కళల పట్ల ఆదరణ తక్కువ అనీ ఇందుకు కారణం సంకుచిత మనసత్వం అన్నారు. నెక్లెస్ రోడ్ వద్ద నాట్య ప్రదర్శన ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి వసుంధర మాట్లాడుతూ... నవ్యనాటక సమితి నాణ్యమైన కార్యక్రమాలకు చిరునామా అన్నారు. కవి ఆచార్య ఫణీంద్ర అధ్యక్షత వహించిన సభలో సంగీత క్షీరసాగర సంస్థ స్థాపకుడు ఆనంద మోహన్, రచయిత్రి కుసుమ కుమారి, నండూరి విద్యారణ్య స్వామి తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్ స్వాగతం పలుకగా కార్యదర్శి సుధారాణి నివేదిక సమర్పించారు.

‘ఉచిత బస్సు ప్రయాణం’లో మార్పులు చేయాలి

కాచిగూడ: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారని, ఈ ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలు ఉన్నాయని, అందువల్ల హేతుబద్ధంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సవరించాల్సిన అవసరం ఉందని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఈ విషయంలో పలు సూచనలు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన బహిరంగ లేఖ రాశారు. అనంతరం బర్కత్‌పురలోని ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీ బస్సుల్లో ఈ మహిళా ఉచిత ప్రయాణాన్ని.. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లందరికి నెలకు రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

రైలులోంచి పడి గుర్తుతెలియని యువకుడి మృతి



కాచిగూడ: రైలు లోంచి పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... ఆర్ట్స్ కాలేజీ-జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ల మధ్య రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి(16) ఎలక్ట్రికల్ పోల్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ‘టిమ్స్’ నిర్మాణం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ కొత్తపేటలో నూతనంగా నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రి పనులను ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణం గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 26 అంతస్తులతో నిర్మాణం జరుగుతుందని, భావితరాలను దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి ఆసుపత్రి స్థలం పరిసరాల్లో చిల్డ్రన్ పార్కు, విద్యుత్ సబ్‌స్టేషన్, వాటర్ ట్యాంక్, అద్భుతమైన హాల్ నిర్మాణానికి స్థలాలను కేటాయించామని తెలిపారు. అలాగే ఆసుపత్రికి వచ్చేవారు సేద తీరేందుకు ఐదు అంతస్తులతో భవనాన్ని నిర్మించటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి భవనం రెండు అంతస్తుల నిర్మాణం పూర్తయ్యిందని, నెలకు ఒక స్లాబ్ చొప్పున నిర్మాణం జరుగుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలు, భద్రత చర్యలు పాటిస్తూ నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, అధికారులు సుభాష్, రాజు, ఆకాజ్యోతి, పద్మాకర్, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, గణేష్ తదితరుల పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి



కళాకారులను సత్కరిస్తున్న వకుళాభరణం

చిక్కడపల్లి: విభిన్న రంగాలలో రాణిస్తున్న వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బుధవారం త్యాగరాయ గానసభలో సత్యసంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘంటసాల జయంతిని పురస్కరించుకొని సంగీత ఉత్సవం, ప్రతిభాఅవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ... ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రతిభావంతులైన రచయితలు, కళాకారులను సత్కరించి గౌరవించడం సత్కార్యమన్నారు. ఎంపిక చేసిన ప్రముఖులకు ప్రతిభా అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనిగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. ఓంకార్‌రాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, హనుమంతరాయశర్మ, బండికనకదుర్గ, శ్రీమణి, నరేంద్రరాథోడ్, కృష్ణ, శూలపాణి, శైలజ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

16న ‘నా ఊరు–ఆ రోజుల్లో’ 5కే రన్



మాట్లాడుతున్న టీటీఏ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (టీటీఏ) ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీ ఉదయం ‘నా ఊరు–ఆ రోజుల్లో’ పేరిట 5కే రన్‌ను నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించనున్నామని అవసరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంత్, టీటీఏ చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు బికాస్ కారార్ తెలిపారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రస్తుతం యువత తమ చిన్ననాటి ఆటలను మరిచిపోతున్నారని, అంతరించిపోతున్న ఆయా ఆటలను తిరిగి సమాజానికి అందించేందుకు వీలుగా ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం నుంచి గిల్లిదండ, గోలీలు, బొంగరం, తొక్కుడు బిళ్ల, అష్టా చెమ్మ, కచ్చకాయలు, రింగ్, ఓముదు గుంటలు, జంగ్లింగ్ ఫీట్స్, బాల్స్, లట్టు, దాగుడు మూతలు, తాడాట (స్కిపింగ్) తదితర ఇండియన్ ట్రెడిషనల్ గేమ్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలోకి మొబైల్ ఫోన్ రావడంతో ఆనాటి ఆటలకు పిల్లలకు దూరం అయ్యారని విచారం వ్యక్తం చేశారు. నేటి తరం పిల్లలకు ఈ ఆటలను పరిచయం చేయడం కోసం తాము కృషి చేస్తున్నామని వివరించారు.

సైదాబాద్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

సైదాబాద్: సమగ్రాభివృద్ధిని సాధించడం ద్వారా సైదాబాద్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి సైదాబాద్ ప్రధాన రహదారి, రెవెన్యూ బోర్డ్ కాలనీల్లో పర్యటించారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడటాన్ని గుర్తించిన ఆమె ఆయా చోట్ల ప్యాచ్‌వర్క్ పనులు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. రెవెన్యూ బోర్డు కాలనీలో రహదారులపై మురుగు నీరు పారకుండా నిర్మిస్తున్న మ్యాన్‌హోల్ పనులను కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే తనకు సమాచారం ఇవ్వాలని, వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ